# పొద్దున్నే చూసిన ముఖం

కథానిక

“ఇవాళ లేచి ఎవరి మొహం చూశానో కాని, అన్నిపనులూ అల్లానే తగలడిపోయాయి. పొద్దున్నే మెయిలుకి మానాన్నని ఊరు పంపించడానికి, స్టేషనుకి వెళితే వెధవమెయిలు అరగంట లేటు. బజారుకెళ్ళి ఏవో బట్టలు కొనుక్కుందామని వెళ్తే, తొందరలో ఎక్కడ ఎలాపోయిందో గాని అయిదు రూపాయిల నోటు పోయింది. షాపువాడికే ఎక్కువ యిచ్చేశానో, ఎక్కడైనా జారిపోయిందో, పోనీ అయిందేదో అయిందని హోటలుకొస్తే, తొమ్మిదిన్నరయినా యింకా వంట కాలేదన్నాడు వాడు. అక్కడ రెండు మెతుకులు తిని ఆదరాబాదరగా కాలేజీకి పరిగెడదామంటే, వసంతమహల్ దాకా వచ్చేసరికి సిటీ బస్ కళ్ళముందునుంచే వెళ్ళిపోయింది. చచ్చేనురా దేవుడా అనుకుని కాళ్ళీడ్చుకుని కాలేజీకిపోతే, కాంపోజిషన్ రాసితేలేదని ఆ లెక్చరరు కాస్తా అటిండెన్సు యివ్వనన్నాడు.

వెధవది... కాలేజీకి పోవడం పెద్ద గండంలాఉందిరా...”

శాస్త్రి యింకా యిల్లా మాట్లాడుతున్నాడు- నేను వింటున్నాను.

“ఎవడునడుస్తాడు-రోజూ యిన్ని మైళ్లు. ఇంతా నడిచిపోతే పొద్దున్న ఒకగంట పని ఉంటుంది. సాయంత్రం మళ్లా ఇంకో రెండుగంటల వర్కు ఉంటుంది. దీనికోసం పొద్దున్నపోయిన తరవాత అక్కడే కూర్చుందామా అంటే... ఏమీతోచదు. ఊరికినే గాడిదలా తిరగాలి ఎండలో, ఆడపిల్లలకే నయం, హాయిగా ఒక్క వెయిటింగ్ రూమ్, ఆ చుట్టూ చల్లనిచెట్లూ చక్కగా అమిరాయి. పోనీ కాసేపు లైబ్రరీలో కూచుందామంటే అక్కడసలు కూచోడానికే చోటుండదు ఒకవేళ ఉన్నా అక్కడ ఒకటే సంతగోల. ఇది లైబ్రరీ, కాస్త నిశ్శబ్దంగా చదువుకోవాలి అనే యింగిత జ్ఞానం లేదేమిరా మనవాళ్ళకి? ఏ భారతిలోనో ఓ కథ పుచ్చుకుని చుట్టుపక్కల వందమందికి మాత్రమే వినపడేంత మెల్లిగా తన పక్కవాడికి చదివి వినిపిస్తాడొకడు. శంకర్స్ వీక్లీలో బొమ్మలు చూసి తనలోతనే మైమరచి గట్టిగా నవ్వేస్తాడింకొకడు. ఈ ఆడపిల్లలు మరీ అన్యాయంరా, బిలబిలమంటూ ఓ డజనుమంది వొచ్చేసి ఉత్త కబుర్లతో కాలక్షేపం చేస్తారు అక్కడ కూచుని. ఇంక అక్కడ విసుగెత్తి, ఒళ్లుమండి కిందకిదిగితే, ఏంపనుంది—లైబ్రరీ నుంచి కాంటీన్‌కి అక్కడ నుంచి (Via) వైటింగ్ రూమ్, ఆఫీసుకి మళ్ళా లైబ్రరీకి—ఇంతేగా ప్రదక్షిణం.

ఇంతకీ ఈసమయమంతా యింట్లోకూచుంటే పొరపాటునేనా పుస్తకం తీస్తామేమోనని నా ఆశ. ఏమైనంతా సోమరిగాగడపడంలో ట్రైనింగ్ యిస్తున్నారు మనకి అధికార్లు—

పోనీ అక్కడుండొద్దు, ఇంటికొచ్చేసి మళ్ళా మధ్యాహ్నం కాలేజీ టైముకి వద్దామా అంటే, పోవడానికో ముప్పావుగంట, రావడానికో ముప్పావుగంట నడవాలి. తిన్న తిండంతా యిందుకే అరిగిపోతుంది. ఉన్న సిటీబస్సులు రెండు. వీటికేనా యింటినుంచి అరమైలునడిచి మరీ అందుకోవాలి. ఇంతకీ యివి అవసరమైనప్పుడుతప్ప మిగతప్పుడల్లా కనిపిస్తాయి. చస్తున్నాం-యీ గొడవతో సైకిలొకటి ఉంటే బాగుణ్ణు.”

అమ్మయ్య-ఆపాడురా ఇప్పటికేనా వాగుడు అని లోపల అనుకుని-“సైకిలు కొనుక్కోలేక పోయినావా?” అన్నాను నేను.

“ఏమిటో, దీనికోసం రెండువందలు తగలెయ్యాలని మానాన్న భయం. ఆవేళ యెవరి మొహం చూశానోగాని సైకిలుకోసమని మా నాన్ననడిగితే అగ్గిరాముడైపోయాడు. నాచదువు చరిత్రంతా ఏకరువుపెట్టాడు. అసలు సంగతేమిటంటే, ఆయన కంతడబ్బు ఖర్చుపెట్టడం ఇష్టం లేదు. ఇప్పటికే నా చదువుకి చాలా అయిపోతోందని ఆయనబాధ.” బెంగ!

వి. నారాయణరావు

శాస్త్రి కనీసం రోజుకి రెండుసార్లైనా సైకిలు సంగతి మాట్లాడతాడు. ఏ విషయం చెప్పాలిసొచ్చినా, మంచికీ, చెడుకీ, 'యీవేళ ఎవరిమొహం చూశానో' అంటాడు. చివరిసారి అన్నాడు గదా—

"మా అత్తయ్యగారింట్లో ఒక సైకిలుందిరా. అది తెచ్చుకుంటే బాగుణ్ణు. ఆవిడని కొంచెం ఉబ్బేస్తే యిచ్చేస్తుంది. వాళ్ళ యింట్లో సైకిలు వాడేవాళ్లెవ్వరూ లేరులే. వాళ్ళ ఆయన జ్ఞాపకార్థం అలా అట్టేబెట్టింది సైకిల్ని."

"అయితే యింకేం, వెయ్యిపదకం! మెల్లిగా వెళ్ళి పట్టుకురా. యీ ఏడాదీ వాడుకుని యిచ్చెయ్యొచ్చు" అన్నాను నేను.

"యిదుగో, యీవేళే వెళ్ళేవాణ్ణి, కాని పొద్దున్నే దీన్ని తగలెయ్య, పిల్లి ఎదురయ్యింది! మంచిశకునం చూసుకుని మరీ వెళ్ళాలి."

* * *

వాళ్ళ అత్తయ్య అంటే, కొంచం దూరపు అత్తయ్య అనుకుంటాను, ఊళ్ళోనే యింకో పేటలో ఉంది. శాస్త్రివాళ్ళది దగ్గిరే ఏదో ఊరు. ఈ ఊళ్లో ఉండి కాలేజీలో చదువుకుంటున్నాడు. హోటల్లో తింటూ, గది అద్దెకి తీసుకోవడంలో, కాలేజీకి దూరంగా, హోటలుకీ దూరంగా కుదిరింది. ఆ రూము చాలా అసౌఖ్యంగా ఉందనీ, మార్చెయ్యాలనీ అంటూంటాడు. కాని బద్ధకం, యింకొకటి వెతకడానికి. అసలు దానికి మరో కారణం, వీడుండే మేడ పక్కనేఉన్న మేడలో ఓ కాలేజీ అమ్మాయి ఉండడం. అందుకని రూము మార్చడు. ఆ రహస్యం నా ఒక్కడికే తెలుసు. కాలేజీ దూరం అనే మిషతో సైకిలు కావాలన్నాడు శాస్త్రి. వాళ్ళ నాన్న ససేమిరా కొనన్నాడు. శాస్త్రికి పచ్చి వెలక్కాయ గొంతున పడ్డట్టయింది. అందుకని అత్తయ్య సైకిలుమీద కన్నువేశాడు.

ఆవేళ నేను శాస్త్రి రూముకి వెళ్ళేసరికి మేడ కింద సైకిలు ఒకటి ఉంది. అత్తయ్య నడిగి తెచ్చాడుకాబోలనుకున్నా. నేను మేడమీదికి వెళ్ళగానే. శాస్త్రి సంతోషం ఏంచెప్పను?

"ఓరేయ్-చూశావా నా ప్రభావం? ఇవ్వేళ లేచి ఎవరి మొహం చూశాను? అత్తయ్య యింటికి వెళ్ళి, (యింకా చాలా పురాణం చెప్తాడురా బాబూ అనుకుని కూచున్నాను నేను.)

మెల్లిగా నాలుగు కబుర్లుచెప్పి, "అత్తయ్యా, కాలేజీకి నడవలేక కాళ్లు బలపాలు కట్టిపోతున్నాయి, కాస్త నీ సైకిలు యిస్తూ, నీ పుణ్యం ఉంటుంది" అనేసరికి, వెంటనే, "ఏం భాగ్యం పట్టుకెళ్లు నాయనా, జాగ్రత్తగా వాడుకుని ఏడాది అయిపోయేక యిచ్చెయ్. నాకు అది యింట్లోఉండి పిల్లలు పెడుతుందా ఏమన్నానా ఏదో ఆయన సైకిలుకదా, అమ్ముకోడానికేమంత కానికాలం రాలేదుగదా అని అట్టే పెట్టానంతే" అంది. "అయ్యో! ఎంత మాటత్తయ్యా" అని సైకిలు తెచ్చేశాను చూశావుగా, కింద ఉంది." అని గబగబా నన్ను తీసుకి కిందికి దిగాడు. ఆ సైకిలు తొక్కిచూడమన్నాడు. మంచిదేనా యింకా ఏమేమిటో అన్నాడు. చివరికి అది వేసుకుని పదిగజాలు పోయివచ్చి, మంచిదేరా-బాగా పోతోంది. కొంచెం బ్రేకు బాగుచేయించు. అన్నదాకా ఊరుకున్నాడు కాదు.

"ఇంకచూడు మనతడాఖా... బాబుగారు ఇహనుంచి సైకిలుమీద వొస్తారు. ఆ అమ్మాయి కెంతగర్వం!-తను సైకిలురిక్షామీద వొస్తుందని!

ఓరి పిచ్చివాడా అనుకున్నాను మనసులో.

"ఇంతకీ యీవేళ ఎవరి మొహం చూశావురా నీకు చిరకాలవాంఛ తీరింది?" అన్నానునవ్వుతూ.

"ఇంకెవరి మొహం"—ఆ అమ్మాయి యింటి వేపు చెయ్యిచూపిస్తూ అన్నాడు. "ఆ మొహంలో కళ ఉందోయ్, ఆ కళ్ళల్లో అదృష్టం తొణికిసలాడుతూంటుంది. మనకి తెలుసులే. అందుకనే అంతధైర్యంగా యీవేళ అత్తయ్య యింటి కెళ్ళాను."—

ఇంకవీడు కాస్సేపాగితే కవిత్వం ప్రారంభిస్తాడు అని భయపడి నేను యింటికిపోయాను.

* * *

సైకిలుకొత్తమోజులో రామం ఆవేళ ఊరంతా తిరిగేశాడు. ప్రతిస్నేహితుడి యింటికీ వెళ్ళి పలకరించి, ఏదో మాటలసందర్భంలో తనకు సైకిలువచ్చిన సంగతి చెప్పేశాడు. తిరిగి తిరిగి అలిసిపోయి "వసంతమహల్" దాకావచ్చి కాఫీ తాగుదామని ఆగాడు.

వేళ వీడు మాంచి హుషారుగ ఉన్నాడు. అలాం టప్పుడు వీడికి వొళ్ళూ పయీ తెలియదు.

ప్రతి హోటలుదగ్గరా సైకిళ్ళు కాపలా కాసే కుర్రాడొకడుంటాడు. మనం సైకిలు అక్కడ పెడితే వాడు మనకో నెంబరుబిళ్ళ యిస్తాడు. మళ్ళీ తిరిగి ఆ బిళ్ళ చూపిస్తే మన సైకిలు మన కిచ్చేస్తాడు.

శాస్త్రి సైకిలు కుర్రాడి కప్పజెప్పాడు. వా డిచ్చిన నెంబరుబిళ్ళ జేబులో వేసుకున్నాడు. హోటల్లోకి వెళ్తుండగా గుమ్మందగ్గిరేనే కని పించాను వాడికి. నేను కాఫీతాగడం అయిపో యింది. శాస్త్రి మళ్ళీ తాగుదువుగాని రమ్మ న్నాడుగాని నేను పోలేదు. బయటనే నిలబడి కొంతసేపు భలే ఉత్సాహంతో మాట్లాడాడు నాతో. చివరి కెలాగో వాణ్ణి వదుల్చుకున్నాను. శాస్త్రి హోటలులో కెళ్ళాడు.

శాస్త్రి కాఫీతాగాడు సావకాశంగా. కనపడ్డ ప్రతివాడితోనూ చెప్పాడు తన సంగతి. ఆవేళ యింతకీ తను పొద్దున్నే చూసిన మొహంవల్ల యింత అదృష్టం కలిసివొచ్చిందని చాలా సన్ని హితులకిమాత్రం నొక్కి చెప్పాడు.

స్నేహితులతో ఏవో కబుర్లలోపడి కొంత దూరంవొచ్చేశాడు. హటాత్తుగాజ్ఞాపకంవచ్చింది; తను సైకిలు హోటలు దగ్గిర మరిచిపోయిన సంగతి. ఖంగారుగా పరుగు లంకించుకున్నాడు. మధ్యలో కుర్రాడు కాపలా ఉన్నాడన్నసంగతి జ్ఞాపకం వచ్చింది. అయినా ఏమో...రామం హడావుడిగా అక్కడ ఆగి "నా సైకిలేదీ?" అన్నాడు కుర్రాడితో.

"నెంబరెంతండి" అన్నాడు కుర్రాడు అల వాటు ప్రకారం.

శాస్త్రి జేబులో చెయ్యిపెట్టాడు—లేదు— పక్కజేబులు వెతికాడు, అక్కడా లేదు. అరె! బిళ్ళ పోయిందే.

"ఎక్కడో జారిపోయిందయ్యా" కొంచెం కంగారు పడకూడదనుకున్నాడుకాబోలు,ధీమాగా అన్నాడు.

"పోనీ మీసైకిలేదో చెప్పండి - అయ్యగారి నడిగి ఆయనతీసుకెళ్ళమంటే తీసుకెళ్దురుగాని."

[illegible]

తన సైకిలు లేదే...అరె! ఏమయింది. తను పొర పాటుగా చూశాడేమో. మళ్ళీ చూశాడు; సావ కాశంగా. తన సైకిలు చాలాగుర్తు, ఎర్రరంగు సీటు, ఆకుపచ్చసైకిలు. ఎక్కడున్నా చటుక్కున కనిపిస్తుందే.

"ఏమయిందయ్యా - యిక్కడే పెట్టాను ఇందాకా?" చూశాడు. అలిసిపోయిఆగిపోయాడు. కనపడ్డ ప్రతివాణ్ణీ పిచ్చిగా అడిగాడు. అంతా తలో మాటా చెప్పారు.

"పోయిన సైకిలు దొరకడం, పోయినమనిషి బతకడం యీకాలంలో చూడమండీ, మీరు అన వసరంగా విచారించక్కరలేదు. ఇక మీకాసైకిలు దొరకదు" అన్నాడొక అనుభవస్థుడైన మిత్రుడు. అతని సైకిలు యిల్లాగే పోతే ఎంత శ్రమపడి తిరిగినా దొరకలేదట. అప్పటినుంచీ కాలేజీకి నడిచివస్తున్నాడు పాపం!

"అయినా పోనీ పోలీసులకి రిపోర్టు యిచ్చి చూడండి" అన్నాడొకాయన.

"మీకేం పిచ్చా-వెర్రా. యిది భారతదేశం. స్కాట్లండుయార్డ్ పోలీసులనుకున్నారా ఏమిటి?" అన్నాడొకాయన.

శాస్త్రి పోలీసుస్టేషను కెళ్ళాడు. వాళ్లు ఆ సైకిలు గుర్తులూ, నెంబరూ, చెప్పమన్నారు. ఇవ్వన్నీ తనకేం గుర్తు? సైకిలుతెచ్చిన కొన్ని గంటలకే పోయింది. తను ఏమీ చూడలేదు. ఎర్రసీటు-పచ్చనిరంగు" యివే అతనికి గుర్తు. ఆ కవరుతీసేస్తే, లోపలసీటు ఏరంగులో ఉంటుందో కూడా చూడలేదు శాస్త్రి.

"ఏమోనండి, మీరసలు బిళ్ళకూడా తేలేదు. తీసికెళ్ళిపోయారో, లేకపోతే అసలు యిక్కడ పెట్టలేదో గ్యాపకం తెచ్చుకోండి."

"అదేమిటోయ్-అలా అంటావ్-యిందాకా నువ్వేగా నా సైకిలు తీసుకుంది" శాస్త్రికి కంగారు ఎక్కువైంది.

"పోనీ మీ బిళ్లేదండి, అది లేకపోతే మరి గురుతేదండి, బోలెడుమంది సైకిళ్లుతీసుకుంటాం."

శాస్త్రి హోటలు మానేజరుకి రిపోర్టుచేశారు. ఆయనవచ్చి 'మీదగ్గిర బిళ్ళలేవిడే అసలు మీరు మీరు సైకిలు పెట్టినట్టు ఋజువులేదండీ, అలాటి

[illegible]

ఖచ్చితంగా చెప్పేసి వెళ్ళిపోయాడు. పక్కనున్న పెద్దమనుషులంతా అంతే అన్నారు.

శాస్త్రికి ముచ్చెమటలుపోశాయి. ఈ సైకి లేమయిపోయింది? ఎవడో దొంగ బిళ్ళ దొంగ లించి మరీ సైకిలు పట్టుకుపోయాడే. లేకపోతే తనే బిళ్ళెక్కడో పారేశాడా-అల్లా అయితే సైకిలుండాలిగా. ఆబిళ్ళ ఎవడికో దొరికుంటుంది, వాడు సైకిలు తీసుకుని ఘరానా వెళ్ళిపోయి ఉంటాడు.

శాస్త్రికి ఆలోచించే వ్యవధిలేదు-రోడ్డంట పరిగెట్టడం ప్రారంభించాడు. వెళుతున్న ప్రతి సైకిలూ ఆశతో, గాభరాతో, "ఈ గుర్తులు చాలవండీ, పచ్చని సైకిళ్ళు ఎర్రసీటువి, చాలా ఉన్నాయి లోకంలో..." చిరునవ్వుతూ చెప్పాడు పోలీసు అధికారి.

రామం మాట్లాడలేకపోయాడు.

"అయినా ప్రయత్నిస్తాం" అన్నాడు కేసు అడ్మిట్ చేస్తూ-పోలీసు అధికారి.

అత్తయ్య నడిగితేనో, అన్నిగుర్తులూ చెపుతుంది-కాని... అమ్మో అత్తయ్యకి తెలిస్తే ఇంకేమన్నా ఉందా!

శాస్త్రి రూము ముఖంపట్టాడు. తనాహోటలు దగ్గిర ఆగకపోయినా బాగుణ్ణు. వెధవగొడవ యిప్పుడు తనకి సైకిలులేదు సరిగదా... అత్తయ్యకి డబ్బిచ్చుకోవాలి... లేదా సైకిలేనా కొనివ్వాలి. నాన్నకి తెలిస్తే యింకేమన్నా ఉందా... పొద్దున్నే లేచి ఎవరిమొహం చూశానోగాని... అనుకున్నాడు. నీరసంగా రూములో పడుకు అలిసిపోయాడేమో-నిద్ర పట్టేసింది.

* * *

సాయంత్ర మవుతుండగా నేను వాడిరూము కెళ్ళాను. అప్పుడే నిద్రలేచి శాస్త్రి బిక్క మొహంతో.

'సైకిలు పోయిందిరా' అన్నాడు.

"ఛా! నిజమా-వేళాకోళమా?"

"నిజంరా! చచ్చినంతవొట్టు. నువ్వు హోటలు గుమ్మందగ్గిర కనిపించావా? నేను కాఫీతాగి బయటికివచ్చాను. బైట సైకిలులేదు. జేబులో నెంబరు బిళ్ళలేదు! ఇవాళ లేచి ఎవరి పాపిష్ఠి మొహం చూశానో కాని... యింత గాడిదా జరిగింది."

"విచిత్రం- యింత ఆరింటిగా ఎవడు దొంగతనం చేశాడో కాని... అయినా అంత వొళ్ళు తెలియటం లేదా నీకు. నీ జేబులో బిళ్ళ కొట్టేస్తుంటే చూసుకోలేకపోయావ్. అసలు సైకిలు కాపలా కూడా ఉండగా పోవడం యింతవరకూ వినలేదు. లేకపోతే నువ్వు బిళ్ళ ఎక్కడో జారవిడిచి, వరసలో సైకిలు గుర్తుపట్టలేకపోయావా? నువ్వు వట్టి కంగారు మనిషివి."

"లేదురా! పదిసార్లు వెతికాను వరసంతా."

"సైకిలెట్లా ఉంటుందో జ్ఞాపకముందా?"

"ఆ! ఎర్రరంగు సీటు- పచ్చసైకిలు."

"ఇదేనా నీ తెలివి? ఆ సైకిలుకి కేరేజీ చివర కొంచం విరిగిఉంటుంది. బ్రూక్స్ సీటు. ఎడం ప్రక్క గ్రిప్పు ఆకుపచ్చది. కుడిపక్క గ్రిప్పు లేదు. ముందుమడ్గార్డు కొంచెం రంగు పోతూ ఉంది, ర్యాలీసైకిలు, ఫ్రేమ్‌మీద చచ్చిపోయిన మీ మావయ్యది కాబోలు పేరుంటుంది-- ఇంకా ఎన్ని చెప్పమంటావ్—" వాడి మొహంలోకి చూశాను.

"ఇవ్వన్నీ ఎప్పుడు చూశావురా?"

"చూడడానికెంత సేపు కావాలోయ్! నీసైకిలు కొంతసేపు తొక్కాను కూడా పొద్దున్న; ఆ మాత్రం గుర్తులు తెలియవ్. చూడాలనే అభిప్రాయం ఉండాలికాని—"

"అయితేపద, పోలీసువాళ్ళకి యీ గుర్తులన్నీ చెప్పివద్దాం."

"నీ సొద యిప్పుడు వినేవాడెవ్వడక్కడ? నాకు తెలిసిన పోలీసు యినెస్పెక్టరొకడున్నాడులే. వాడితో నేను యీగుర్తులుచెప్తాను. రేపు పొద్దున్నే నువ్వూవొచ్చి కేసు రిపోర్టురాసియిద్దువుగాని. అయినా పోయినసైకిలు దొరకడంకష్టంరా! రంగు మార్చేస్తే నీ సైకిలు మళ్ళా గుర్తుపట్టలేం" అన్నాను.

"ఇవాళ లేచినవేళావిశేషం అలాంటిది. లేవగానే ఏ పాపిష్టిమొహం చూశానో" శాస్త్రి తలకాయ చేత్తో కొట్టుకుంటూ అన్నాడు.

"పొద్దున్నే లేచి ఆ అమ్మాయిమొహం చూశానన్నావ్ గదరా!"

"అవునురా! ఆ పాపిష్ఠి మొహమే...గుడ్లగూబకళా అదీని... దానివల్లే యింతపనయింది.

ఆ సైకిలు అసలు మా అత్తయ్య యివ్వకపోయినా బాగుణ్ణు. యిప్పుడావిడకి డబ్బిచ్చుకోవాలి."

"పోనీ వోయ్-కాబోయే మామగారిచ్చుకుంటాడులే... త్వరగా వెళ్ళాడెయ్ ఎవరినేనా చూసి"

"నీకేమిటిరా... చెప్తావ్. పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణసంకటం."

"సరే-బెంగపెట్టుకుని ఏంచేస్తావ్. పోయిన సైకలెలాగూ పోయింది. రేపు పోలీసుస్టేషనుకెళ్ళి చూదాం-ఏమైనా ఫలిస్తుందేమో. అంతకన్నా మనమేమి చెయ్యగలం?" అని మెల్లిగా యింటికి చేరుకున్నాను.

* * *

మర్నాడు పొద్దున్నే వాడిరూముకివెళ్ళాను. అప్పటికే వాడు లేచాడు. మంచంమీదే కూచున్నాడు. "పదరా స్టేషనుకి వెళ్దాం...మళ్ళా యినస్పెక్టరు ఎక్కడికేనా పోతాడు"అన్నాను.

"ఉండరా—లేవగానే యీవేళ పిల్లెదురైంది. యివేళేం రాసిపెట్టుందో-నేను యిప్పుడే స్టేషనుకి రాను. యింకొంచంసేపు పడుకోవాలి."

"ఏడిచి ఏలక్కాయలు తిన్నట్టున్నాయి-నీ తెలివి తేటలు. త్వరగా నీసైకిలు వెతుక్కుంటావా? పిల్లి కనపడింది, పిల్ల కనపడింది, నక్క కనపడింది అని పిచ్చినమ్మకాలు పెట్టుకుంటావా? పద."

బలవంతాన వాడిని బయలుదేరదీశాను. తిన్నగా పోలీసుస్టేషనుకి వెళ్ళాము. లోపలికెళ్ళేక ఆ యినస్పెక్టరు మమ్మల్ని పలకరించి "ఏమండీ నిన్ననేదో సైకిలు పట్టుకున్నామండీ, ఎర్రసీటు, పచ్చసైకిలన్నారు...అదీ అలాటిదే... మీదేనేమో చూడండి" అన్నాడు.

శాస్త్రి ఏదీఏదీఅంటూ కంగారుగాచూశాడు. ఆయన మమ్మల్ని లోపలికి తీసుకెళ్ళి చూపించాడు. ఆశ్చర్యం, ఆసైకిలే! శాస్త్రి సంతోషం పట్టలేకపోయాడు. "నాసైకిలే, నాసైకిలే" అంటూ అమాంతందాన్ని కావిలించుకున్నంతపని చేశాడు.

ఆ యినస్పెక్టరు ఏదో కొంత తతంగంచేసి.. శాస్త్రి నాకు తెలుసనీ, ఆ సైకిలు అతనిదేననీ నాచేత రాయించుకుని సైకిలిచ్చేశాడు.

"అమ్మయ్య! ఒక పీడకలలాటి సంఘటన అయిపోయింది. ఇవేళ ఎంత అదృష్టం - లేచి యెవరి మొహం చూశానో—" అన్నాడు శాస్త్రి సైకిలు నడిపిస్తూ.

"ఎవరి మొహం చూశావ్? పిల్లి మొహం చూశావ్! అసలు బయటికి రానన్నావుగా!" అన్నాను కసిగా.

రామం చిన్నబోయాడు.

"పిచ్చివాడా! యీ చాదస్తపు ముసలమ్మనమ్మకాలు పెట్టుకుని, నీయిష్టం వచ్చినట్టు పేలుతున్నావ్. నిన్నమటుకు నిన్న మీఅత్త సైకిలు యిచ్చేసరికి. ఆ అమ్మాయి మొహం ఎంతో మంచిదా! ఆ కళ్ళల్లో అదృష్టం తొణికిసలాడుతుందా! మధ్యాహ్నానికల్లా ఆసైకిలు పోయేసరికి, అదే మొహం పాపిష్ఠిదా? ఆకళ్లు గుడ్లగూబకళ్లయిపోయాయా? ఇంతకి ఆ అమ్మాయిమొహం ఏమీ మారలేదు. మారింది నీబుద్ధిలేని బుద్ధే. పైగా నీకు వచ్చే కష్టనష్టాలకి నువ్వు పొద్దున్నే చూచేవారెలా బాధ్యులు?"

"ఎవరైనాసరే...నీచిత్తం వచ్చినట్లల్లా వాగకు ఈనేళేమయింది. పిల్లి కనపడ్డం పెద్ద దుశ్శకునం కదా! మరి పోయి యిక నిరాశచేసుకున్న సైకిలు ఎలా దొరికిందీ? పిచ్చినమ్మకాలతో పిచ్చిపేలాపన పేల్తావ్. నిన్నుచూసి ఎవడూచదువూ, సంస్కారమూ ఉన్నవాడనుకోడు." అని నాలుగు దులిపేశాను.

శాస్త్రి నీరైపోయాడు. సైకిలు లోపల పెట్టుకుంటూ 'నాది తప్పేనా యింకెప్పుడూ అనను' అన్నాడు.

ఆవేళనుంచి, మళ్ళీ ఎప్పుడూ శాస్త్రినోట వినలేదు...'యివేళ ఎవరిమొహం చూశానో' అన్నమాట.

* * *

అసలు యింతకీ మీకు చెపుతున్నా...అప్పుడు హోటలుదగ్గిర శాస్త్రి కనిపించినప్పుడు వాడి చొక్కాజేబులో నెంబరుబిళ్ళఉంది. నేనుదాన్ని మాటల్లోనే తీశాననీ, వాడావిషయం గమనించలేదనీ, అప్పుడాసైకిలు తీసుకుని తిన్నగా యింట్లో పెట్టాననీ ... నాకో మంచి సబ్‌యినస్పెక్టరు స్నేహితుడున్నాడనీ మీకుచెప్తే.. యింక మిగతావి నిగూహించుకోగలరు.

—A